నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 27 మే 2025 | KHAMMAM

సెప్టెంబర్ ఒకటి తెల్లవారుజామున భారీ వర్షానికి పాలేరు వద్ద తెగిన నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ (ఫైల్)

ఏపుగా పెరిగిన చెట్లతో నిండి ఉన్న నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ

ప్రమాదపుటంచున ఖమ్మం జిల్లా

జూలైలో పెదవాగు ప్రాజెక్టుకు గండిపడిన దృశ్యం (ఫైల్)

గతే డాది కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో అపార నష్టం వాటిల్లింది. నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ జుజ్జుల్‌రావుపేట వద్ద తెగిపోయింది. అనేక చెరువు కట్టలు, వాగులు, చెక్‌డ్యామ్‌లు తెగిపోయాయి. అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. రైతులకు తీరని నష్టం వాటిల్లింది. అయితే గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ.. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఏ మాత్రం ప్రణాళికలు రూపొందించలేదు. కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అదే జరిగితే జిల్లాలో ప్రాణ, ఆస్తినష్టం భారీగానే ఉండే ప్రమాదం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ముఖ్యంగా నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న నీటి వనరులను కాపాడటంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది.

- ఖమ్మం, మే 26

- కాలువల్లో జంగిల్ క్లియర్ లేదు..
- చెరువుకట్టలు, తూములకు మరమ్మతులు నిల్
- ఈ ఏడాది భారీ వర్షాలు పడే అవకాశం
- రక్షణ చర్యలు చేపట్టని ప్రభుత్వ యంత్రాంగం
- గతేడాది వానలకు జిల్లాలో అపార నష్టం
- ముగ్గురు మంత్రులున్నా ముందస్తు ప్రణాళికలు శూన్యం
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు, రైతాంగం



పెదవాగు ప్రాజెక్టుకు గండిపడడంతో పొలాల్లోకి కొట్టుకొచ్చిన బండరాళ్లు (ఫైల్)

ఖమ్మం జిల్లాలో మేజర్ ఇరిగేషన్ కింద పాలేరు, వైరా, లంకాసాగర్ చెరువులు ఉన్నాయి. ఇవికాకుండా మైనర్ ఇరిగేషన్ కింద మరో 1,400 చెరువులు ఉన్నవి. వాటిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నాగార్జునసాగర్ కాలువ ద్వారా చెరువులను నింపుతున్నారు. దీనివల్ల సాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో రెండు పంటలు పుష్కలంగా పండుతున్నవి.. చేపల ఉత్పత్తి విరివిగా పెరిగింది. మెట్ట ప్రాంతాల్లో కూడా వరిని పండిస్తున్నారు. ఐతే గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీసి చెరువుల స్థిరీకరణను పెంచింది. వందల కోట్ల రూపాయలను వెచ్చించి చెరువు కట్టలు, తూములను పటిష్టం చేసింది. ఐతే గత ఏడాది భారీగా కురిసిన వర్షాల వల్ల జిల్లాలోని అనేక చెరువు కట్టలు తెగిపోయాయి. అప్పట్లో తాత్కాలికంగా మరమ్మతులు చేసినప్పటికీ శాశ్వత పద్ధతిలో మరమ్మతులు చేయకపోవడం వల్ల భారీ ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టలను పటిష్టం చేయాలని, తూముల రిపేరుకు నిధులు ఇవ్వాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. చెరువుల్లో కనీసం పూడిక తీయాలని వేడుకుంటున్నారు.

సాగర్ కాలువ.. నో క్లియర్

నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ మూడు జిల్లాలకు సాగునీరు అందిస్తున్నది. ఈ కాలువ మొత్తాన్ని మూడు జోన్‌లుగా విభజించారు. మొదటి జోన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరు అందిస్తారు. ఈ జోన్‌లో రైతులకు సాగర్ నిండుగా నిండితే జూలై 10వ తేదీనే నీరు విడుదల చేస్తారు. రెండో జోన్‌లో ఖమ్మం జిల్లాకు, మూడో జోన్ ఏపీకి చెందిన కృష్ణా జిల్లా రైతులకు సాగునీరు అందిస్తారు. ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు 2,54,174 ఎకరాలు ఉంది. ఇదికాకుండా పాలేరు ద్వారా భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా 58 వేల ఎకరాలు, చెరువుల ద్వారా లక్ష ఎకరాలు, లిఫ్టుల ద్వారా మరో 50 వేల ఎకరాలకు మొత్తం ఖమ్మం జిల్లాలోని 4 లక్షల 50 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు ఈ ప్రధాన ఎడమ కాలువ ద్వారా అందుతున్నది. అలాంటి కాలువపైన ప్రారంభం నుంచి ముగింపు వరకు కూడా చెట్లు పెరిగి దెబ్బతిన్నది. కాలువ మొత్తం జంగిల్‌తో నిండి ఉంది.. కాలువను శుభ్రం చేసేవారు లేరు..

ప్రభుత్వం ఇప్పటివరకు జంగిల్ క్లియరెన్స్ కోసం నిధులు విడుదల చేయలేదు. జిల్లాలోని ఖమ్మం, కల్లూరు డివిజన్‌ల పరిధిలోని అనేక ప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడ్డాయి. వర్షం ఎక్కువ కురిసి, వరదలు వస్తే కాలువలు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఐనా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

కొత్త లిఫ్టులు లేవు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త లిఫ్టులు మంజూరు చేయలేదు.. పాలేరు నియోజకవర్గంలో మంజూరు చేశామని అమాత్యులు ప్రకటనలు చేశారు కానీ అవి కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 48 లిఫ్ట్‌ల్లో సగానికి పైగా మరమ్మతులు చేయాల్సి ఉందని నీటిపారుదల శాఖకు చెందిన కల్లూరు డివిజన్ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం వాటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. ఫలితంగా వాటికి భవిష్యత్‌లో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

ఎక్కడా పనులు జరగట్లేదు..

వానకాలం సీజన్ ప్రారంభంకానుంది.. మరో వారంలో తెలంగాణకు రుతుపవనాలు తాకవచ్చు. ప్రతి ఏడాది జూలైలో నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తారు.. మరో నెలరోజులు మాత్రమే ఉంది.. కానీ.. ఇంతవరకు జంగిల్ క్లియరెన్స్ లేదు.. నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తే రూ.40 లక్షలు మంజూరయ్యాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. వాటికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు.. పనులు ఇంకా ప్రారంభంకాలేదు. ఈలోపు వర్షాలు కురిస్తే పనులు జరిగే అవకాశం అసలే లేదు.

కాలువలను బాగు చేయాలి..

వానకాలం వస్తున్నది.. ఈసారి వర్షాలు బాగా కురుస్తాయని చెబుతున్నారు. కానీ ఇంతవరకు సాగర్ కాలువపైన ఉన్న చెట్లను క్లియర్ చేయలేదు. ఇప్పటికే అదపాదడపా వానలు వస్తున్నాయి.. ఐనా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన కాలువతోపాటు పిల్ల కాలువలు కూడా అంతే ఉన్నాయి. వాటిలో కనీసం పూడిక కూడా తీసిన పాపానపోలేదు.

- సరిత, టేకులపల్లి, ఖమ్మం

చెరువుల్లో పూడిక తీయట్లేదు..

కేసీఆర్ ప్రభుత్వంలో చెరువులను అద్భుతంగా తయారు చేశారు. చెరువుల లోతు పెంచడం వల్ల ఆయకట్టు మొత్తం పంటలు పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదు. చెరువు బాగుంటేనే ఊరు బాగుంటుంది. అలాంటిది ఇప్పుడు నాయకులెవ్వరూ చెరువులను పట్టించుకోవట్లేదు.

- స్వాతి, భానాపురం, ఖమ్మం

కాంగ్రెస్ కార్యకర్తల దాడి హేయం

ఖండించిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి వనమా

ఎంపీ వద్దిరాజు

మాజీ మంత్రి వనమా

ఖమ్మం/ పాల్వంచ, మే 26 : సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ పాలకులు దాడులను ప్రోత్సహిస్తూ 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ గూండాలను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అత్యుత్సాహం కనబర్చి లాఠీలతో చితకబాదడం శోచనీయమన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

భూ రికార్డుల చట్టం అమలుకే శిక్షణ

భద్రాద్రి కొత్తగూడెం, మే 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికే సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ మైనింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూ సర్వే చేయడం కోసం ఎంపికైన 426 మంది అభ్యర్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు బ్యాచ్‌లు

శిక్షణలో పాల్గొన్న వారికి మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

విభజించి ఉదయం ధియరీ, మధ్యాహ్నం క్షేత్రస్థాయికి తీసుకెళ్లి భూ సర్వేపై శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం అభ్యర్థులకు సర్వేకు సంబంధించిన గొలుసులు, క్రాస్ స్టాఫ్, కాలిక్యులేటర్, స్కేల్, పెన్సిల్, నోట్ బుక్స్‌తోపాటు స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన కిట్లను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కళాశాల ఏడీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మైనింగ్ కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం ధర్నా

అర్హులకు మంజూరు చేయాలని డిమాండ్

చర్ల, మే 26 : అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో నిరుపేదలు చర్ల మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండా చరణ్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నా.. వారికి ఇందిరమ్మ కమిటీలు అన్యాయం చేశాయని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్నవారికి, ధనవంతులకు ఇండ్లు మంజూరు చేస్తూ.. నిరుపేదలకు మొండిచేయి చూపారన్నారు. మొదటి విడతలో మంజూరు కానివారికి రెండో విడతలో అంటూ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కొండా కౌశిక్, ప్రవీణ్, మోహన్, పంబికుమారి, శాంత, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

చర్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిరుపేదలు

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం టౌన్, మే 26 : ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి.. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు పేర్కొన్నారు. కాగా.. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల పంచాయతీకి చెందిన లింగం నితీష్‌రెడ్డి, పాల్వంచకు చెందిన జక్కుల రాము, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న పావురాల రామ తులిశమ్మ, గాంధీనగర్‌కు చెందిన మణికంఠ తదితరులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు.

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మే 26 : అర్హులైన ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి పీవో వినతులు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని వెంటనే పరిష్కరించి.. మిగతా వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు, వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేసి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌సీవో గురుకులం అరుణకుమారి, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఏవో సున్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

మధ్యవర్తి ద్వారా రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమేశ్

ఖమ్మం రూరల్, మే 26 : మధ్యవర్తిగా ఉన్న డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ జక్కి అరుణ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన కథనం ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తికి రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలో సర్వే నెంబర్ 713/ఏ2లో 2,700 చదరపు గజాల స్థలం ఉంది. సదరు వ్యక్తి ఆ భూమిని తన కొడుకు పేరుపై గిఫ్టు రిజిస్ట్రేషన్ చేయించిందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెండు రోజుల క్రితం వెళ్లాడు. అప్పటికే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.51 వేలతో చలానా సైతం తీసుకున్నాడు. అయినప్పటికీ గిఫ్టు డీడ్ రిజిస్ట్రేషన్‌కు సబ్ రిజిస్ట్రార్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు పన్నిన పథకం ప్రకారం.. మరోసారి బాధితుడు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి రూ.50 వేలు ఇవ్వలేనని చెప్పి.. రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో సబ్ రిజిస్ట్రార్ అరుణ ఆ డబ్బును డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్‌కు ఇవ్వాలని చెప్పింది. ఆ తర్వాత భూమికి మధ్యాహ్నం ఒంటిగంటకు స్లాట్ బుక్ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత సదరు ఫిర్యాదుదారుడు మధ్యవర్తి వెంకటేశ్‌కు రూ.30 వేలు ఇస్తుండగా అప్పటికే కార్యాలయం వద్ద పాగా వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు డాక్యుమెంట్ రైటర్ లంచం తీసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయని ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ వెంకటేశ్‌ను అరెస్టు చేసి వరంగల్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ వెంకటేశ్

వినతులు త్వరితగతిన పరిష్కరించండి

ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, మే 26 : తమ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి సోమవారం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు సమర్పించే దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంకు చెందిన సీతమ్మ, షేక్ రజియా సుల్తాన, ఎం.సావిత్రి, వేంసూరు మండలం కుంచపర్తికి చెందిన కర్ని దుర్గ, బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామానికి చెందిన రాంబాబు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీజ

చివరి విడత శిక్షణ ప్రారంభం

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 26 : జిల్లాలోని ఉపాధ్యాయులకు చివరి విడత వృత్యంతర శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ విడతలో మొత్తం ఆరు కేంద్రాల్లో 675 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నారు. పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొమ్ముగూడెంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేటీపీఎస్‌లను డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్‌తో కలిసి సందర్శించారు. కొమ్ముగూడెంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రస్తుతం తరగతి గది డిజిటల్ తరగతి గదిగా మారబోతున్న తరుణంలో ఉపాధ్యాయులు ఆధునిక పరిజ్ఞానాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జిలు సైదులు, శ్రీనివాసరావు, డీఆర్పీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

వైద్య శిబిరాలకు ముందస్తు ప్రణాళికలు

పెనగడప పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

చుంచుపల్లి, మే 26 : సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశించారు. పెనగడప పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఇందుకోసం యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన క్షయ, మలేరియా, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధులు తదితర వాటిపై లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ నెల 21 నుంచి జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ నేహా అంబ్రిన్, నర్సింగ్ ఆఫీసర్ సమ్మక్క, ఫార్మాసిస్టు సుభద్రాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రణీత్ తదితరులు ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో